
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 35.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 7 జూలై 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	527.00 (162.3490)	57,668	4,724
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.65 (3.60)	209.02	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.215 (20.3903)	నిల్	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



నార్కట్‌పల్లి డిపోలో నిలిచిన ఎలక్ట్రికల్ బస్సులు

ఎలక్ట్రికల్ బస్సుల పరుగులు ఎన్నడో?

- ఇప్పటికే సూర్యాపేట డిపో పరిధిలో రోడ్డెక్కిన బస్సులు
- జిల్లా బస్సులు మాత్రం నార్కట్‌పల్లి డిపోలో భద్రం
- సబ్‌స్టేషన్ నిర్మాణంలో జాప్యం చేస్తున్న విద్యుత్‌శాఖ
- చార్జింగ్ పాయింట్‌లకు విద్యుత్ లేక బస్సులు నడపని పరిస్థితి



పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మంజూరుచేసిన ఎలక్ట్రికల్ బస్సులు ఇప్పటికే సూర్యాపేట డిపో పరిధిలో పరుగులు పెడుతూ ప్రయాణికుల కు సేవలు అందిస్తుండగా, జిల్లాలో మాత్రం రోడ్డెక్కడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు ఆరు నెలలుగా 33/11కేవీ లైన్‌ను ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తుండటంతో చార్జింగ్ పాయింట్లకు విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఎలక్ట్రికల్ బస్సులు డిపోకే పరిమితమవుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

సూర్యాపేట జిల్లాకు 79 ఎలక్ట్రికల్ బస్సులను మంజూరు చేయగా, ఇప్పటికే 45 బస్సులు డిపోకు చేరాయి. అవి ప్రయాణికులకు సేవలు కూడా అందిస్తున్నాయి. నల్లగొండ డిపోకు 75 బస్సులు మంజూరు చేయగా, ఇప్పటికే 40 బస్సులు చేరాయి. అయితే అవి నార్కట్‌పల్లి డిపో ఆవరణలో భద్రపరిచారు. ఆరు నెలల క్రితమే విద్యుత్ పనులు పూర్తి కావాల్సి ఉండగా, సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో బస్సులు నడవడం లేదు. ఇటీవల నల్లగొండ రీజియన్ ఆర్టీసీ అధికారులు విద్యుత్‌శాఖ అధికారులకు లేఖ కూడా రాశారు. అయితే ఆ పనులు ఎప్పటికి పూర్తవుతాయో స్పష్టమైన సమాచారం లేదు. ఇప్పటికే ఎలక్ట్రికల్ బస్సులు రోడ్లపై తిరగాల్సి ఉండగా, సబ్‌స్టేషన్ లేకపోవడం, చార్జింగ్ పాయింట్‌కు విద్యుత్ రాకపోవడంతో ఎలక్ట్రికల్ బస్సులు నార్కట్‌పల్లి డిపోలోనే నిలిపారు. బస్సులు రన్నింగ్‌లో లేకపోవడం, ఇలాగే జాప్యం చేస్తే చార్జింగ్ లేక అవి మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉంది. యాదాద్రి జిల్లాకు సంబంధించి విద్యుత్ బస్సుల కోసం ప్రతిపాదనలు పంపగా, ఆ జిల్లాకు ఎన్ని బస్సులు కేటాయించాలనే దానిపై ఆర్టీసీ

- మిగతా 7వ పేజీలో...

వానాకాలం సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్‌కు నీటి విడుదల ప్రారంభమైంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతోంది. దీంతో నేరేడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీకి చెందిన మత్స్యకారులు చేపల వేటకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు వలలు, బోట్లు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ/ నేరేడుగొమ్ము)



వైజాగ్‌కాలనీ చేపల వేటకు వేళాయే

- శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదల
- కృష్ణాపరివాహక ప్రాంతంలో పెరుగుతున్న నీటిమట్టం
- మత్స్యకారుల ఆనందం

కృష్ణాపరివాహక ప్రాంతంలో కొంత కాలంగా నీటిమట్టం తగ్గడంతో వైజాగ్‌కాలనీకి చెందిన మత్స్యకారులు చేపలవేట లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేగాక బోట్లు, వలలు మూలనపడ్డాయి. ఈ ఏడాది ముందస్తుగానే కృష్ణానది ఎగువభాగంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉంది. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల చేస్తుండడంతో కృష్ణాపరివాహక ప్రాంతంలో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతోంది. దీంతో మత్స్యకారులు ఉత్సాహంగా ఉన్నారు. ముందస్తుగా కృష్ణా పరివాహక ప్రాంతంలో నీరు పెరుగుతుండడంతో చేపల వేట పెరుగుతుందని ఆశాభావంతో మత్స్యకారులు అందుకు సన్నద్ధమవుతున్నారు.

చేపల వేటే ప్రధాన వృత్తి

వైజాగ్‌కాలనీలో 400 కుటుంబాలు ఉన్నాయి. వారందరికీ చేపల వేటే జీవనాధారం. 100వరకు మరపడవలు, బోట్లు ఉన్నాయి. మత్స్యకారులు 20 నుంచి 30 కిలో మీటర్ల దూరం వరకు బోట్లు, పుట్టీలు, పడవల్లో వెళ్లి చేపల వేట కొనసాగిస్తారు. పుట్టీలో వెళ్లే క్రమంలో ఈదురుగాలులు వీచినా, అలల తాకిడి పెరిగినా, వర్షం కురిసినా ప్రమాదమే. అయినా వీరికి చేపలవేటే జీవనాధారం కావడంతో ప్రమాదకర వృత్తి అయినా తప్పడం లేదు. 50 ఏళ్లుగా వీరు వైజాగ్‌కాలనీలో ఇళ్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారు. సాగర్ వెనుక జలాల్లో పూర్తిస్థాయి నీటిమట్టం పెరిగితే చేపలవేట ఆశించిన మేర సాగదని మత్స్యకారులు చెబుతున్నారు. సీజన్‌లో ప్రతీ రోజు ఒక్కొక్కరు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు చేపలవేటతో ఉపాధి పొందుతున్నారు. వైజాగ్‌కాలనీ మత్స్యకారులు పట్టిన చేపలను హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. మత్స్యకారులు పట్టిన చేపలను వ్యాపారులు కొనుగోలు చేసి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

పచ్చి, వట్టి చేపలకు డిమాండ్

కృష్ణానదిలో పట్టిన చేపల్లో పోషక విలువలు అధికంగా ఉండడంతో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి చేపల్లో కొవ్వులేకపోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో అత్యధికంగా వీటిని తినేందుకు మొగ్గు చూపుతున్నారు. వైజాగ్‌కాలనీ మత్స్యకారులు పట్టి ఎండబెట్టిన చేపలను విశాఖపట్నం, బెంగుళూరు, చెన్నై, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. బొచ్చ, రవ్వ, పాంప్లేట్, ముల్లజల్లతోపాటు ఎండుచేపలను విక్రయిస్తారు. అదేవిధంగా కృష్ణమ్మ అందాలు చూసేందుకు వైజాగ్‌కాలనీకి పర్యాటకులు అధికంగా వస్తుంటారు. వారి కృష్ణానదిలో ఉత్సాహంగా స్నానాలు చేసి, బోట్ షికారు చేయడంతోపాటు ఇక్కడి మహిళతో చేపల వంటలు చేయించుకొని ఆరగిస్తుంటారు. దీంతో వీరికి ఉపాధి కలుగుతోంది. అయితే ఇక్కడి తమకు ప్రభుత్వం రుణాలు మంజూరుచేయడంతోపాటు, వలలు, బోట్లు అందజేయాలని, ఎకోటూరిజంగా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.


రుణాలు మంజూరు చేసి వలలు పంపిణీ చేయాలి



నేను 30 ఏళ్లుగా వైజాగ్‌కాలనీలో ఉంటూ చేపలవేట ఆధారంగా జీవనం సాగిస్తున్నా.ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది.చేపలవేటకు వెళ్తే రూ.1000నుంచి రూ.1500 వరకు గిట్టుబాటు అవుతుంది. వలలు, మరబోట్లకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలి.

- వాసిపల్లి అచ్చయ్య, మత్స్యకారుడు, వైజాగ్‌కాలనీ

ఎకోటూరిజం కేంద్రంగా అభివృద్ధి



వైజాగ్‌కాలనీలో ఎకోటూరిజం ఏర్పాటు చేస్తాం. దీంతో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. త్వరలో ఎకోటూరిజం పనులు ప్రారంభమవుతాయి. వైజాగ్‌కాలనీతోపాటు గాజుబేడం గుహలు, దేవరచర్ల శివాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధిచేస్తాం.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

కేజీబీవీల్లో.. కొత్త మెనూ





కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కొత్త మెనూ ప్రకారం ఆహార పదార్థాలు

రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా నూతన మెనూ అమలు చేయాలని ఆదేశించింది. నెలలో రెండుసార్లు మాంసాహారంతోపాటు వారంలో ఐదుసార్లు గుడ్లు, రోజూ నెయ్యి అందిస్తున్నారు. నూతన మెనూ పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ ఆదేశించింది. 2025-26 విద్యా సంవత్సరంలో సరికొత్త రుచులతో వంటకాలు చేయాలని ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచింది. గతంలో ఒక్కో విద్యార్థికి నెలకు మెస్ చార్జీలు రూ.1225 ఉండగా ఇప్పుడు రూ. 1740కి పెంచింది.

- (ఆంధ్రజ్యోతి,భూదాన్‌పోచంపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో రూపొందించిన కొత్త మెనూను అమలు చేయడం ఆరంభించింది. దీని అమలుకు కార్యాచరణ కూడా సిద్ధం చేసింది. అయితే దీన్ని అమలు చేయడానికి అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు తరుచూ పర్యవేక్షిస్తేనే ఈ మెనూ సక్రమంగా అమలయ్యే అవకాశం ఉంది.

కొత్త మెనూ ప్రకారం..

- **ఉదయం అల్పాహారం:** టమాటా, కిచిడీ , రాగిజావ,ఇడ్లీ సాంబారు, పాలు, పూరీ, పులిహోర,బోండా, ఉప్మా, చపాతీ, అరటిపండ్లు.
- **మధ్యాహ్నం:** అన్నంతోపాటు టమాటా పప్పు, నెయ్యి,రసం,పెరుగు,బాయిల్డ్ ఎగ్, చికెన్, మటన్.
- **సాయంత్రం:** ఉడికించిన పెసర్లు, శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లం-పల్లీలు, అల్లం టీ, మిల్లెట్ బిస్కట్‌లు, పకోడి. **రాత్రి :** అన్నంతోపాటు వివిధరకాల కూరలు,సాంబార్, బటర్ మిల్క్.

కొత్త మెనూ పక్కాగా అమలు చేస్తాం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొత్త మెనూ పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. కేజీబీవీల్లో విద్యార్థినులకు ఏరోజు ఎంత ఇవ్వాలనేది మెనూ నోటీస్ బోర్డు ద్వారా వివరిస్తాం. చదువుతోపాటు బాధ్యతగా పౌష్టికాహారం అందేలా చూస్తాం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతాం.

- ప్రభాకర్, ఎంఈవో, భూదాన్‌పోచంపల్లి

దేశ నిర్మాణానికి బాటలు వేసిన జగ్జీవన్‌రాం

జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శశికళ



సాంఘిక సంక్షేమశాఖ డీడీ శశికళ

నల్లగొండ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భావి భారత నిర్మాణానికి బాటలు వేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం అని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.శశికళ అన్నారు. మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా పదవు లు నిర్వహించి దేశ సర్వతోముఖాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, సమానత్వం కోసం జగ్జీవన్ ఉద్యమించారన్నారు. మహనీయుల ఆశయసాధన సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ పెరిక కరన్‌జయరాజ్, జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, ఐటీసీ ఛానల్ ఎండీ ఏచూరి భాస్కర్, శైలజ, కత్తుల షణ్ముఖకుమార్, పెరిక ఉమామహేశ్వర్‌రాజు, దుబ్బ రూప అశోక్‌సుందర్, కందుల లక్ష్మయ్య, విరిగి ప్రసాద్, కత్తుల తులసీదాస్, పడిదల నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మీ-సేవలో

- 22 శాఖలకు సంబంధించిన 482 రకాల సేవలు
- అందుబాటులో మరో రెండు రకాల సేవలు
- మార్కెట్ విలువ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం

6

పచ్చిరొట్టతో పుడమికి పోషణ

7

జీలుగు, పెసర సాగుచేస్తున్న రైతులు

గంజాయికి బానిసలై.. ఇళ్లలో దొంగతనాలు

- గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ముఠా
- రూ.20లక్షల సొత్తు స్వాధీనం

6

ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం



వైశ్య రాజకీయ రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణ

నార్కట్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆగస్టు 3న హైదరాబాద్‌లో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం నార్కట్‌పల్లిలోని వాసవీ భవన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ చైతన్యం కోల్పోతుండటంతో వైశ్యజాతి వివక్షకు గురవుతోందని, ఓటు బ్యాంకు వర్గంగా ముద్రపడుతోందని అన్నారు. వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని గతంలో తాను నిర్వహించిన వైశ్య గర్జన ఫలితంగా ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అగ్రవర్ణం అనే ముద్ర కారణంగా పేద వైశ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన నివేదికలోని అగ్రవర్ణాల వివరాలను ప్రకటించి ఈడబ్ల్యూఎస్‌ను వర్గీకరించాలని, విదేశీ సహాయ నిధి ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలన్నారు. వీటన్నింటినీ సాధించుకోవాలంటే పాలకులపై ఒత్తిడి తేవాలని, ఆ సన్నాహకంలో భాగంగానే నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారుడిగా నియమితుడైన కాచం సత్యనారాయణను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిశెట్టి శ్రీనివాస్, బుక్కా ఈశ్వరయ్య, సల్లా వాసుదేవ్, మండల గౌరవాధ్యక్షుడు ఇడుకుళ్ల బిక్షమయ్య, మండల, పట్టణ శాఖల అధ్యక్షులు బిల్లకంటి శ్రీకాంత్, పసునూరి శ్రీనివాస్, కర్నాటి రమాదేవి, దేవరశెట్టి నారాయణ, షరాబు శ్రీనివాస్, భాశెట్టి శ్రీనివాస్, ఇడుకుళ్ల సంపత్, పసునూరి సంపత్, దోసపాటి వేణు, బండారు శ్రీనివాస్, రమేశ్, పబ్బతి ప్రసాద్, పల్లెర్ల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో పూజల్లో పాల్గొన్న భక్తులు

శాస్త్రోక్తంగా తొలి ఏకాదశి

నల్లగొండ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సమీపంలోని దేవాలయాలకు చేరుకొని ఇష్టదైవాన్ని పూజించారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. పట్టణంలోని రామగిరి సీతారామచంద్ర స్వామి దేవాలయం, వీటీ కాలనీలలోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి దేవాలయం, తులసీనగర్ భక్తాంజనేయ స్వామి దేవాలయం, షేర్ బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, పానగల్లులోని ఛాయ, పచ్చల సోమేశ్వరాలయంలో తొలి ఏకాదశి వేడుకలను అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రామాలయంలో వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం చేశారు. రాఘవేంద్ర కాలనీలో షిర్డీ సాయి సహిత ద్వాదశ జోతిర్లింగాల ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేసి గోరింటాకు పండుగను నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో చంద్రమౌళీశ్వర స్వామికి అర్చకుడు మహంకాళి పవన్ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం నుంచి హిందువుల పండుగలు మొదలుకానున్నాయి.



నల్లగొండ రామాలయంలో పవళింపు సేవ

వేడుకగా మొహర్రం



నల్లగొండలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

నల్లగొండ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త మనువడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి ప్రతీకగా నిలిచిన మొహర్రం పండుగను ముస్లింలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల నుంచి పీర్ల కొట్టంలో బడేనాల్‌సాబ్, చోటేనాల్‌సాబ్ పీర్లను అధిష్ఠింపజేసి ఆదివారం ప్రార్థనలు నిర్వహించి పట్టణంలో ఊరేగించారు. జామ మసీదులోని పీర్ల కొట్టం నుంచి మొదలైన ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా సాగింది. భక్తులు అడుగడుగునా పీర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. పానగల్లులోని చెరువు వద్దకు ఊరేగింపు నిర్వహించి పీర్లను నిమజ్జనం చేశారు. ఊరేగింపు సందర్భంగా ముస్లిం యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మిర్యాలగూడ అదనపు పీపీగా రఘురామరావు నియామకం

7

ఎల్లమ్మ ఆలయంలో జిల్లా జడ్జి కవిత

కనగల్, జూలై 6:(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశీపురం రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని జిల్లా ఉమెన్స్ కోర్టు జడ్జి కవిత ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకులు జడ్జికి వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న జిల్లా జడ్జి కవిత

ఇంటర్ కోసం దూరం వెళ్లాల్సిందే

● కట్టంగూరులో కలగానే జూనియర్ కళాశాల
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కట్టంగూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలానికి జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. జూనియర్ కళాశాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న విద్యార్థులకు జూనియర్ కళాశాల లేకపోవడంతో పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా కట్టంగూరు మండలానికి చెందిన విద్యార్థుల సమస్యలు తీరడం లేదు. ఎన్నికల సమయంలో ఇది చేస్తాం, అది చేస్తామనే హామీలే తప్ప ఆచరణ నోచుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యను చదివేందుకు కట్టంగూరు మండలం నుంచి ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులు 12 కిలోమీటర్ల నుంచి 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించి విద్యను అభ్యసిస్తున్నారు. దాదాపు జిల్లాలోని అన్ని మండలాలకు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసినా కట్టంగూరు మండలానికి జూనియర్ కళాశాల ఎందుకు ఏర్పాటు చేయడం లేదని పలు విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నత చదువుల కోసం 15కిలోమీటర్లు ప్రయాణం

కట్టంగూరు మండలంలో 22గ్రామపంచాయతీలతో పాటు 20ఆవాస గ్రామాలు ఉన్నాయి. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువు కోసం 15కిలోమీటర్ల పైనే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కట్టంగూరు మండలం నుంచి ప్రతీ విద్యా సంవత్సరం 400కు పైగా విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తున్నారు. దీంతో 10వ తరగతిలో ఉత్తీర్ణత అయిన విద్యార్థులు కట్టంగూరులో కళాశాల లేకపోడంతో నకిరేకల్, నార్కట్‌పల్లి, నల్లగొండ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో విద్యార్థులు అక్కడి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతూ విద్యను అభ్యసించాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టంగూరు మండలంలో 10 జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉన్నాయి. కట్టంగూరుకు జూనియర్ కళాశాల కావాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జూనియర్ కళాశాల మంజూరు చేయాలి



మండలం నుంచి ప్రతి సంవత్సరం 400మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్మీడియట్ చదువు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కట్టంగూరుకు జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని అనేకసార్లు విన్నవించినా ఫలితం లేదు. రాజకీయ నాయకులు దృష్టి సారించి కట్టంగూరుకు జూనియర్ కళాశాల మంజూరు చేయించేందుకు కృషి చేయాలి.

బత్తిని రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


సత్తయ్య మృతదేహం

కనగల్, జూలై 6:(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని రైతు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ మండలం జీచెన్నారం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... జీచెన్నారం గ్రామానికి చెందిన దుబ్బాక సత్తయ్య(45) పొలం పనులు ముగించుకుని రాత్రి 7:30 గంటల సమయంలో నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై జీచెన్నారం గ్రామ శివారులో నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడేనికి చెందిన గంగాదేవి మహేష్ దర్వేశిపురం నుంచి నల్లగొండ వైపునకు బైక్‌పై అతివేగంగా వెళ్తూ సత్తయ్యను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సత్తయ్యకు బలమైన గాయాలు కాగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అనంతరం క్షతగాత్రుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సత్తయ్య మృతిచెందినట్టు డాక్టర్లు తెలిపారని 108 వాహన ఈఎంటీ మహేష్, పైలట్ శంకర్ తెలిపారు. సత్తయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిక్కుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


చిట్యాలలో మాట్లాడుతున్న తెలంగాణ సిక్ సొసైటీ చైర్‌పర్సన్ తేజ్‌దీప్‌కౌర్ మీనన్


చిట్యాల, జూలై 6, (ఆంధ్రజ్యోతి): సిక్కుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ సిక్ సొసైటీ చైర్‌పర్సన్ తేజ్‌దీప్‌కౌర్ మీనన్ తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాలలోని సిక్కు కాలనీలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సిక్కులతో మాట్లాడి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సిక్కు సొసైటీ పరంగా పేద సిక్కులను ఆదుకుంటామనీ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న భజన్‌కౌర్‌కు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్ బహదూర్‌సింగ్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు ఇవ్వాలి : చిరుమర్తి

కేతేపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు అవసరమైన ఎరువులు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా లేదని, కనీసం ఎరువులు, విత్తనాలు సైతం అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులు ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టిన పాత రోజులు కన్పిస్తున్నాయన్నారు. ఎరువులు సరఫరా చేయలేక అధికారులు చేతులెత్తేశారని విమర్శించారు. ప్రభుత్వ చేతగానితనంతో రాష్ట్రంలో 1.94లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల లోటు ఉందన్నారు. ఇది కాలం తెచ్చిన కరువుకాదని కాంగ్రెస్ తెచ్చినకరువని ధ్వజమెత్తారు. గతంలో ఈ సమయానికి మూసీ ఆయకట్టుకు బీఆర్ఎస్ హయాంలో వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేశామని చెప్పారు. ప్రస్తుత పాలకులు పంట సాగు సమయం దాటుతున్నా ఆయకట్టుకు సాగు నీటి విడుదలపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి, నాయకులు బంటు మహేందర్, కొండ సైదులు, బొప్పని సురేష్ తదితరులు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

పచ్చిరొట్టతో పుడమికి పోషణ


అన్నారావు క్యాంపులో జీలుగ సాగు

ఒకే రకమైన పంటల సాగు, అధిక మోతాదులో రసాయనిక ఎరువుల వాడకం తదితర కారణాలవల్ల భూమిలోని పోషకాలు తగ్గిపోతున్నట్లు భూ సార నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భూ సారాన్ని పెంచేందుకు గతంలో పశువులు, గొర్రెల ఎరువును వేసి రైతులు భూమిలో కలియదున్నడం ద్వారా భూ సారం పెంపొందే విధంగా చూసేవారు. రానురానూ పల్లెల్లో ముఖ్యంగా ఆయకట్టులో పశుసంతతి గణనీయంగా తగ్గడంతో సేంద్రియ ఎరువుకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో వరి సాగు చేసే రైతులు భూసారాన్ని పెంపొందించడంతో పాటు పోషకాల రక్షణకు పచ్చిరొట్ట సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

పంటకు కావల్సిన పోషకాలను అందించేందుకు రైతులు మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగిస్తున్నారు. దీనివల్ల భూసారం కోల్పోతుందని భూసార పరిశోధనా కేంద్ర నిపుణులు పేర్కొంటున్నారు. పంటలకు రకరకాల చీడపీడలు సోకుతాయి. పర్యావరణం దెబ్బతింటుంది. భూమిలో పంట మొక్కల ఎదుగుదలకు, దిగుబడికి అవసరమయ్యే పోషకాలను రక్షించేందుకు సేంద్రియ ఎరువుల వినియోగంతో అన్ని విధాలా మేలు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. కాగా ఆయకట్టులో ఎన ఇతర ప్రాంతాల నుంచి మేత కోసం వలస వచ్చే జీవాలు, పశువుల మందలను కొందరు రాత్రివేళలో తమ పొలాల్లో పడుకోబెట్టడం వల్ల వాటి మూత్రం, పేడతో భూసారం పెంపునకు కృషి చేస్తున్నారు. కాగా 800ఉన్న జీవాల మందను ఒక్కరాత్రి తన పొలంలో ఉంచడానికి మందల యజమానులకు రైతు 2000-2500 వరకు చెల్లించడంతో పాటు నాలుగు కిలోల బియ్యం, తాగునీటి వసతి కల్పించాల్సి వస్తోంది. ఖర్చుతో కూడిన పనికావడంతో కొందరు రైతులు మందల జోలికి వెళ్లడం లేదు. తక్కువ ఖర్చుతో స్థూల సేంద్రియ ఎరువుగా పచ్చిరొట్టను సాగు చేస్తే భూసారం పెంచేందుకు రైతులు ఎక్కువగా పచ్చిరొట్ట సాగుకు మొగ్గుచూపుతున్నారు.

జీలుగు, పెసర సాగుచేస్తున్న రైతులు

40-50 రోజుల సాగు

జీలుగు, జనుము, పిల్లి పెసర, పెసర, అలసందలను రైతులు పచ్చిరొట్ట సాగుకు వినియోగిస్తున్నారు. ఇవి మొగ్గ దశవరకు పెంచి సుమారు (40-50 రోజుల కాలం) ఈ పంటలను దుక్కిలో కలియదున్నడం వల్ల పచ్చి ఆకులు నీటిలో మురిగి దమ్ము చేసే సమయంలో పూర్తి స్థాయిలో మట్టిలో కలిసిపోయి ఎరువుగా మారుతుందని అంటున్నారు. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలను అందిస్తుందని అంటున్నారు. ఆకుల్లో నత్రజని శాతం ఎక్కువగా ఉంటుంది. వీటి వేర్లలో ని బుడిపెల్లో నత్రజని స్థిరీకరణ జరిగి మరలా మొక్కలకు అందేలా తోడ్పడుతాయి. వరినారు మడి విత్తడానికి 10 రోజుల ముందు పచ్చిరొట్ట విత్తనాలు దుక్కిలో చల్లుకుంటే నాటు వేసే సమయానికి దమ్ములో కలియదున్నుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసారం పెరుగుతుంది. నాణ్యమైన దిగుబడులు పెరుగుతాయి.



నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు



పచ్చిరొట్ట సాగుతో భూమి గుల్లబారుతుంది. నత్రజని అందుతుంది. పంటకు ఉపయోగపడే సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెందుతాయి. రసాయనిక ఎరువులు ముఖ్యంగా యూరియా వాడకాన్ని బస్తా వరకు తగ్గించుకోవచ్చు. చీడపీడల వృద్ధి తగ్గుతుంది. నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. నేల సారవంతంతో ఏ పంట వేసినా మంచి దిగుబడులు సాధించవచ్చు. ఆరోగ్యకర పంటలను పండించవచ్చు.

-శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ.

పచ్చిరొట్ట వైపు ఐదు వేలమంది రైతుల మొగ్గు

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సుమారు 11.40లక్షల ఎకరాలు అంచనా వేయగా, అందులో వరి 5.25లక్షల ఎకరాలు సాగు చేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అందులో జీలుగు 4,178 మంది, జనుము 700 మంది, పెసర 500 మంది రైతులు పచ్చిరొట్టను సాగుచేయగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 3,000 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు విక్రయించింది. కాగా రైతులు భూసార పరీక్షల ద్వారా భూసారాన్ని తెలుసుకుని నేలలో తగ్గిన పోషకాలను గ్రహించి, పంటకు తగిన పోషక పదార్థాలను ఎరువుల రూపంలో అందిస్తే పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

గంజాయికి బానిసలై.. ఇళ్లలో దొంగతనాలు

● గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ముఠా ● నలుగురు అరెస్టు, పరారీలో మరో ఇద్దరు ● రూ.20లక్షల సొత్తు స్వాధీనం

నల్లగొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసలై రాత్రి సమయాల్లో ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు, మరో నిందితుడితో పాటు వారికి సహకరిస్తున్న మహిళను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ కేసు వివరాలు వెల్లడించారు. తన ఇంట్లో దొంగతనం జరిగిందని జూన్ 30వ తేదీన నార్కట్‌పల్లిలో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి గాలి యాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. 22 తులాల బంగారు ఆభరణాలు, 80తులాల వెండి ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. నార్కట్‌పల్లి సీఐ, ఎస్ఐతో పాటు సిబ్బంది బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 6వ తేదీన ఉదయం 5గంటల సమయంలో నార్కట్‌పల్లి గ్రామ శివారులో రెడ్డయ్య ఫ్యాక్టరీ పక్కన వెంచర్‌లో నలుగురు నార్కట్‌పల్లి చుట్టు పక్కల అవసరమున్న వారికి గంజాయి విక్రయించేందుకు వచ్చారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంచర్‌కు వెళ్లిన సమయంలో అనుమానాస్పదంగా కన్పించిన ఇద్దరు మైనర్ నిందితులతో పాటు హైదరాబాద్ నాగోల్‌కు చెందిన బాజపల్లి జోసఫ్, అదే ప్రాంతానికి చెందిన మహిళ ఎరిక్ విల్‌సన్ మెరినాలను పట్టుకొని విచారించారు. రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి దానిని నార్కట్‌పల్లి చుట్టుపక్కల అవసరమున్న వారికి విక్రయించేందుకు ప్రయత్నించారు. నిందితుల నుంచి రెండు కిలోల గంజాయి, బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

గతంలో కేసులు నమోదైనా..

గతంలో వీరిపై జవహర్‌నగర్, నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. నిందితుల్లో ఒక మైనర్‌కు దగ్గరి బంధువులు నార్కట్‌పల్లి మండలంలో ఉండడంతో తనకు ఈ ప్రాంతమై అవగాహన ఉండడంతో నార్కట్‌పల్లి మండలంలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్

గంజాయి విక్రయించడంతో పాటు తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరికి ఎరిక్ విల్‌సన్ మెరీనా అనే మహిళ కూడా సహకరించింది. వీరు కత్తి, బల్లెం దగ్గర పెట్టుకొని దొంగతనాలు చేస్తూ అడ్డువస్తే చంపడానికి వెనుకాడరని ఎస్పీ తెలిపారు. హైదరాబాద్ నాగోలుకు చెందిన బోస్, ఒడిషా చెందిన మాలిక్ పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల నుంచి 17తులాల బంగారం, 70తులాల వెండి, 50వేల విలువైన రెండు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, మొత్తం రూ20లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి పర్యవేక్షణలో, నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ డి.క్రాంతికుమార్, ఏఎస్ఐ అంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ రాము, కానిస్టేబుల్ సత్యనారాయణ, హరిప్రసాద్, శివశంకర్, తిరుమల్, కృష్ణ, మహేష్ కేసును చేధించారు. సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రెండు గ్రామాల్లో విషాదఛాయలు

● వేర్వేరు ఘటనల్లో శాలిగౌరారం మండలం ఉట్కూరు, వంగమర్తి గ్రామాలకు చెందిన నలుగురు మృత్యువాత

శాలిగౌరారం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో నలుగురు మృత్యువాత పడడంతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఉట్కూరు, వంగమర్తి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కట్టంగూరు మండలకేంద్రంలో జాతీయ రహదారిపై ఈ నెల 5వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డు ప్రమాదంలో తల్లికొడుకు మృతిచెందగా, అదే రోజు శాలిగౌరారం మండలంలోని వంగమర్తి గ్రామంలో తల్లీ, కూతురు ఆత్మహత్య పలువురిని కలిచివేసింది. మండలంలోని ఉట్కూరు గ్రామానికి చెందిన వారు కట్టంగూరులో ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో పిట్టల రజనీకాంత్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలపాలై చికిత్సపొందుతూ రజనీకాంత్ తల్లి శంకరమ్మ ఆదివారం ఉదయం మృతిచెందింది. అదేవిధంగా మండలంలోని వంగమర్తి తల్లి కూతురు ఆత్మహత్య ఘటనలో తల్లి వాణి మృతదేహం శనివారం బావిలో లభించగా, ఆది వారం ఉదయం చిన్నారి మృతదేహం లభించింది. మృతదేహాన్ని శాలిగౌరారం ఎస్ఐ పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చిన్నారి మృతదేహం కోసం 16గంటలు శ్రమించిన ఫైర్ సిబ్బంది

మండలంలోని వంగమర్తిలో తల్లీకూతురు ఆత్మహత్య ఘటనలో చిన్నారి హర్షిత మృతదేహం ఆదివారం ఉదయం లభించింది. నకిరేకల్ ఫైర్ సిబ్బంది సుమారు 16 గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం హర్షిత మృతదేహాన్ని చూడగానే కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మతిస్థిమితం కోల్పోయిన తల్లి సింగారపు వాణి శనివారం తన తొమ్మిది నెలల కూతురు హర్షితను తీసుకొని వచ్చి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో పడేసి తానూ బావిలో దూకింది. తల్లి వాణి మృతదేహం శనివారం సాయంత్రం లభించగా, కూతురు హర్షిత మృతదేహాన్ని 16 గంటల పాటు శ్రమించిన ఫైర్ సిబ్బంది బయటికి తీశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి తీసుకెళ్లారు.


వంగమర్తిలో చిన్నారి మృతదేహాన్ని ఎత్తుకొని రోదిస్తున్న బంధువు

వర్షం కోసం చుట్టుకాముడు

వర్షం కురిసేలా కరుణించాలని వరుణ దేవుడిని కొలుస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలోని శ్రీజల బసవ లింగేశ్వరస్వామి ఆలయం ఎదుట గుట్టపై ఆదివారం మహిళలు చుట్టుకాముడు ఆడారు. వేపమండలతో అలంకరించి బిందెపై బిందెపెట్టి చుట్టుకాముడు ఆడిన అనంతరం జల బసవ లింగేశ్వరస్వామికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రచ్చ రజని, రాచకొండ శోభ, బండ అరుణ, దొండ రజని, లక్ష్మీ పాల్గొన్నారు.

● మోత్కూరు, ఆంధ్రజ్యోతి.



ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

మునుగోడు, చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ప్రతిభ కనబర్చిన నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య బోధన అందుతుందన్నారు. తాను కూడా ప్రభుత్వ బడిలోనే చదివనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నప్పటికీ ప్రైవేట్ స్కూళ్లపై మోజు పెంచుకున్న కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను స్టేటస్ కోసమే చదివిస్తున్నారన్నారు. కూలి చేసుకునే పేదలు సైతం కష్టపడుతూ తన కష్టంలో 75శాతం పిల్లల చదువుకే ఖర్చు చేస్తున్నారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 62పాఠశాలల నుంచి 189మంది విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు మొత్తం రూ.21లక్షలు నగదు బహుమతులుగా ప్రతిభా పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పబ్బు రాజుగౌడ్, డీఈవో సత్యనారాయణ, ఎంఈవో గురువారావు, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ, రమేష్, విప్లవ్ పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని దండుమల్కాపురంలోని ఆందోళ్ మైసమ్మ ఆలయంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు పూజలు నిర్వహించారు.


పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు

సాగర్ నీటి మట్టం 527 అడుగులు

● వారంలో 13 అడుగులు పెరుగుదల

నాగార్జునసాగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 527 అడుగులకు చేరుకుంది. జూన్ 30వ తేదీ నాటికి 514.30 అడుగులుగా ఉన్న సాగర్ నీటి మట్టం ఎగువన ఉన్న శ్రీశైలం జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా సాగర్‌కు రోజుకు సుమారు 50 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ నీటి మట్టం వారం రోజుల్లో 13 అడుగులు పెరిగి 527 అడుగులకు చేరుకుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 527 అడుగులు (162.3490 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 3374 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 4,724 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా 57,668 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి కుడి, వరద కాల్వలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి నీరు విడుదల చేయలేదు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బీఎల్ఎఫ్(బహుజన లెఫ్ట్ ఫ్రంట్) ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంసీపీఐ రాష్ట్ర నేత వస్కుల మట్టయ్య, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి మాట్లాడారు. ఇంటర్ పూర్తి చేసిన బాలికలకు అడ్మిషన్ ఇప్పిస్తామని సర్టిఫికెట్లు తీసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మొన్న ఒక విద్యార్థిని కలెక్టర్‌కు, నిన్నొక విద్యార్థిని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్, బీసీ విద్యార్థి సంఘం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్, గాదగోని మహేష్‌గౌడ్, గిరిజన విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌నాయక్, జక్కా నాగేశ్వరరావు, సైదానాయక్, రమేష్ పట్టేటి తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు జీవోను రద్దు చేయాలి

నల్లగొండ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పని గంటల పెంపు విధానాన్ని అమలు చేస్తూ విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకు 10 గంటల పని విధానాన్ని అమలు చేయడం కష్టజీవుల చెమట చుక్కల్ని కార్పొరేట్ బడా యజమానులకు అనుకూలంగా ఇవ్వడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం బాటలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తోందని, కార్మికుల శ్రమదోపిడీ చేయడానికి కట్టు బానిసలుగా మార్చడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అన్ని మండల పట్టణ కేంద్రాల్లో కార్మిక వర్గం, ఉద్యోగులు సోమవారం తక్షణమే నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేయాలని కోరారు. పని గంటలు పెంచే యోచనను విరమించు కోవాలని లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తుమ్మల హెచ్చరించారు.

మిర్యాలగూడ అదనపు పీపీగా రఘురామరావు



మిర్యాలగూడ లీగల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా స్థానిక న్యాయవాది సీహెచ్. రఘురామరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ఐదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ప్రభుత్వం తరుపున క్రిమినల్ కేసుల్లో వాదనలు వినిపిస్తారు. త్రిపురారం మండల కేంద్రానికి చెందిన రఘురామరావు నెల్లూరులోని వీఆర్ లా కళాశాలలో 1990లో పట్టాభద్రులై 1991 నుంచి మిర్యాలగూడ, నిడమనూరు కోర్టుల్లో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీల తరుపున ఆయా కోర్టుల్లో కేసులు వాదించారు. ఆయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ ఉచిత శిక్షణ పొందేందుకు ఈ నెల 7వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఏ. నర్సిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రాత పరీక్ష నిర్వహించి 100మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బైపాస్ రోడ్డు బాధితులకు పరిహారం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న హాషం

నల్లగొండ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్లు నుంచి ఎస్ఎల్‌బీసీ వరకు నిర్మిస్తున్న 565 బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూమి కోల్పోతున్న బాధితులకు బహిరంగ మార్కెట్ కు మూడింతలు పెంచి ఇవ్వాలని బైపాస్ రోడ్డు బాధితుల పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు సయ్యద్ హాషం, కన్వీనర్ పల్‌రెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన 565 బైపాస్ రోడ్డు బాధితుల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో నిర్మిస్తున్న 565 బైపాస్ రోడ్డు పానగల్లు నుంచి ఆర్జాలబావి, మర్రిగూడెం, గిరికబావిగూడెం, గుండ్లపల్లి ఎక్స్‌రోడ్డు, మామిళ్ళగూడెం మీదుగా కొత్తపల్లి ఎస్ఎల్‌బీసీ సాగర్ రోడ్డు వరకు సుమారు 3వేల మందిపైగా వ్యవసాయ భూములు, ప్లాట్లు ఇళ్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ విలువకు ప్రభుత్వ మార్కెట్ విలువకు చాలా వ్యత్యాసం ఉందని పేదలు పైసా, పైసా కూడ బెట్టి ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేశారని తెలిపారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సయ్యద్ హాషం, గౌరవ సలహాదారుడిగా దండెంపల్లి సత్తయ్య, కన్వీనర్‌గా పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, కో కన్వీనర్లుగా దోనాల నాగార్జునరెడ్డి, ఎం రాజేశ్వర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, సూరారం జగన్ ఎన్నికయ్యారు.

గిరి ప్రదక్షిణ యాత్రకు 8న స్పెషల్ బస్సులు

నల్లగొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ డిపో నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు ఈనెల 8న సాయంత్రం స్పెషల్ బస్సు సర్వీసులు నడిపించనున్నట్లు నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు పెద్దలకు రూ. 4వేలు, పిల్లలకు రూ.2200లు టికెట్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ స్పెషల్ బస్సు నల్లగొండ నుంచి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం వెళ్తుందని పేర్కొన్నారు. బుకింగ్ కోసం సెల్: 9160360707, 9866898332, 9959844918 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మీ సేవలో



» 22 శాఖలకు సంబంధించిన 482 రకాల సేవలు » అందుబాటులో మరో రెండు రకాల సేవలు » మార్కెట్ విలువ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం

మీసేవ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పౌరులకు సేవలు అందిస్తోంది. దీని ద్వారా వివిధ ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా పొందవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించడంలో మీ-సేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో నిత్యం వేలాది మంది మీ- సేవ సేవలు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 22శాఖలకు సంబంధించిన 482 రకాలు సేవలు ఒకే పొందవచ్చు. తాజాగా మరో రెండు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. వివాహ ధ్రువీకరణ పత్రం, మార్కెట్ విలువ సర్టిఫికెట్ సేవలను జాబితాలో చేర్చారు.

- ఆంధ్రజ్యోతి, భువనగిరి రూరల్

ఉమ్మడి నల్లగొండ జిలాల పరిధిలోని 297మీ-సేవ కేంద్రాల్లో ఇప్పటికే పలు రకాల సేవలు ఆయా కేంద్రాల ద్వారా ప్రజలకు అందుతున్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులన్నీ వీటి ద్వారానే సంబంధిత కార్యాలయాలకు చేరుతున్నాయి. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారు. తాజాగా ప్రభుత్వం వివాహ ధ్రువీకరణపత్రాలు, మార్కెట్ విలువ సర్టిఫికెట్ కూడా తీసుకునే వెసులుబాటు కల్పించింది.

మార్కెట్ విలువ సర్టిఫికెట్

అపార్ట్‌మెంట్, ఇంటి స్థలం, ఇతర స్థిరాస్తులపై ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ నిర్ధారించుకోవడానికి మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చు. పరిశీలన పూర్తయిక సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి ఆస్తికి సంబంధించిన ప్రస్తుతంమార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తుంది. ఇందుకు ఆధార్‌కార్డు, ఇల్లు,స్థలం, డాక్యుమెంట్, పన్ను రశీదు, జిల్లా, మండల, గ్రామం, వివరాలు సమర్పించాల్సి ఉంటుంది.

వివాహ ధ్రువీకరణ పత్రం

వివాహ ధ్రువీకరణ పత్రం పలు సందర్భాల్లో అత్యవసరం. దంపతుల ఆధార్‌కార్డులు, వయసు, పుట్టిన తేదీ, కుల, ఆదాయ, పదో తరగతి ధ్రువీకరణ పత్రాలతో పాటు పెళ్లి ఫొటోలు, వివాహకార్డులతో దరఖాస్తు చేసుకోవాలి. వివాహం చేసుకున్న ప్రాంతం, వివాహ తేదీ, భార్యాభర్తల మతం, వృత్తి, శాశ్వత చిరునామా, దరఖాస్తుదారుల తల్లిదండ్రుల పేర్లు, చిరునామా దరఖాస్తులో పొందుపరచాలి. నోటరీ న్యాయవాది నుంచి నోటరీ అఫిడవిట్ తీసుకోవడంతో పాటు అలాగే పెళ్లి చేసుకున్న ఆలయం, ఫంక్షన్‌హాల్ యాజమాన్యం నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. నిర్దేశించిన ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. తర్వాత స్లాట్ బుక్ చేసుకుని ఆ తేదీకి సబ్ రిజిస్ట్రార్ ఎదుట ముగ్గురు సాక్షులతో పాటు భార్యాభర్తలు హాజరు కావాలి. దరఖాస్తును పరిశీలించి వివాహ ధ్రువీకరణపత్రం జారీ చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెండు రకాల సేవలు మీసేవ జాబితాలో చేర్చింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలకు పాలన చేరువ చేయాలనే లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. కొత్త సేవల ద్వారా ప్రజలు అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. పారదర్శకతతో సులభంగా, వేగంగా పనులు పూర్తవుతాయి.

- ఎన్. సాయికుమార్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ యాదాద్రి భువనగిరి జిల్లా.

ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ల రద్దు, రవాణా రంగ పరిరక్షణ, కార్మికుల ఉపాధి రక్షణ, ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన జరిగే సమ్మెలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని నల్లగొండ జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, ఆటో యూనియన్ బీఆర్‌టీయూ అధ్యక్షుడు కలగోని యాదయ్య, సీఐటీయూ నాయకుడు ధరావత్ హనుమంతునాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్లో సీఐటీయూ, బీఆర్‌టీయూ ఆటో సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 10 సంవత్సరాల కాల పరిమితి పూర్తయిన డీజిల్, 15 సంవత్సరాల కాల పరిమితి పూర్తయిన పెట్రోల్ వాహనాలను ఉపయోగించొద్దని షరతు విధించిందన్నారు. వాహనాలతో స్వయం ఉపాధి పొందుతున్న డ్రైవర్లకు ఇది పెను భారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు టౌన్ కన్వీనర్ అవుట రవీందర్, నాయకులు నఫీజ్, కేశవులు, బాబా, శంకర్, మహమూద్, గోరే, ఇబ్రహీం, సైదులు, రాములు, శంకర్ పాల్గొన్నారు.

జీవోను రద్దు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం దుకాణాలు, స్థాపనల చట్టంలోని సెక్షన్ 16,17 సవరణ చేస్తూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ ఈ నెల ఐదో తేదీన ప్రకటించిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇది పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లాభం చేకూర్చడానికి దోహదపడుతుందని, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరదన్నారు.

భువనగిరిలో మాతం ప్రదర్శన



భువనగిరిలో మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు



భువనగిరి టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త మనుమడు ఇమాం హుస్సేన్ కుటుంబం కర్బాలా యుద్ధంలో చేసిన ప్రాణ త్యాగాలను స్మరిస్తూ తొమ్మిది రోజుల క్రితం ప్రతిష్ఠించిన పీర్లను ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా అంతటా నిమజ్జనం చేశారు. అంతకు ముందు పీర్లను ఊరేగించారు. జిల్లాకేంద్రంలోని 22అషుర్ ఖానాల్లో ప్రతిష్ఠించిన పీర్లను ఆయా బస్తీల్లో ఊరేగించారు. అమరులను స్మరిస్తూ ఆయుధాలతో రక్తం చిందేలా ఒంటిపై బాదుకుంటూ మాతం ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షియా ముస్లిం సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ మెహది హుస్సేన్, సయ్యద్ కల్బే హుస్సేన్ ఆబేది, మజీద్ కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హైదర్ హుస్సేన్, సయ్యద్ రజా హుస్సేన్, ముక్రేన్ అబ్బాస్, లయాక్ అలీ పాల్గొన్నారు.

లక్ష్మీ నారసింహులకు తొలి ఏకాదశి పూజలు

వైభవంగా లక్ష పుష్పార్చన



గుట్టలో లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు వెంకటాచార్యులు

యాదగిరిగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టు వస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్ర నామ పఠనాలు, సుగంధ పరిమళం వెదజల్లే వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమన రీతిలో గంటపాటు పూజా పర్వంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

తొలి ఏకాదశి విశిష్టత..

ఉపవాస దీక్షతో రాత్రి జాగారం తర్వాత విష్ణుమూర్తిని పూజిస్తే పాపాలు తొలగుతాయని తొలి ఏకాదశి విశిష్టత ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు భక్తులకు వివరించారు. తొలి ఏకాదశి పర్వదినాన యోగ నిద్రలోకి వెళ్ల నాలుగు నెలల తర్వాత ఉత్థాన ఏకాదశి రోజున విష్ణుమూర్తి మేల్కొంటాడని ప్రతీతి అని తెలిపారు. ముఖ్యంగా నాలుగు మాసాల కాలాన్ని పవిత్రంగా పరిగణించి దీక్ష చేపట్టడం అనవాయితీ అని వివరించారు. హిందూ పండుగలు ఆదివారం నుంచే ప్రారంభమవుతాయని చెప్పారు.

ఆదివారం రద్దీ

ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో యాదగిరిగుట్టకు తరలివచ్చారు. హైదరాబాద్‌లో బోనాల పండగ, ఆషాఢ మాసం అయినందున భక్తులు అక్కడి నుంచి ఎక్కువగా రాలేదు. ఉభయ క్యూలైన్ల ద్వారా స్వయంభువులను దర్శించుకున్న భక్తులు ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీ పడ్డారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, ఆరగింపు సమయాల్లో భక్తులు సుమారు మూడు గంటల పాటు నిలిచినందున ఉచిత దర్శన భక్తులు క్యూకాంప్లెక్స్, రూ.150 ప్రత్యేక దర్శన భక్తులు క్యూలైన్లల్లో వేచి ఉన్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకే వేచి ఉన్న సమయంతో కలిపి ప్రత్యేక దర్శనం గంట, ఉచిత దర్శనం గంటన్నర సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కొండకింద అన్నదాన సత్రం, లక్ష్మీపుష్కరిణి, బస్‌స్టేషన్ ప్రాంగణంతో పాటు కొండపైన ప్రధానాలయం, ప్రాకార మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయ శాలలు, శివాలయం, తూర్పు రాజగోపురం చేరుకునే ర్యాంపు వద్ద భక్తుల రద్దీ సాధారణంగా ఉంది.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామిఅమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో శ్రీపర్వతవర్థిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమ రీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ ప్రవచనాలు

● ఏడాది కాలంలో 24 ఏకాదశులు వస్తాయని, ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అంటారని తొగుట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ ప్రవచించారు. యాదగిరిగుట్ట క్షేత్రాన్ని ఆదివారం సందర్శించిన స్వామిజీకి ఆలయ ఈవో, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, ప్రధానాలయం, శివాలయం పూజారులు వేర్వేరుగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. ధ్వజస్థంభానికి మొక్కి అంతరాలయంలోని స్వయంభువులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామిజీ మంగళశాసనాలు అందజేసి ప్రవచించారు. శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై శయనించడమే తొలి ఏకాదశి ప్రత్యేకతన్నారు. తొలి ఏకాదశి నుంచే హిందు దేవుళ్ల పండుగలు ప్రారంభమవుతాయన్నారు. తొలి ఏకాదశిన శయనించిన మహావిష్ణువు తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొంటాడని స్కందపురాణం తెలుపు తోందని అన్నారు. ఈ పర్వదినాన ఉపవాస దీక్షతో విష్ణుమూర్తిని పూజిస్తే మోక్షప్రాప్తి కలుగుతుందన్నారు. తొలి ఏకాదశి పర్వదినాన యోగ నిద్రలోకి వెళ్లి నాలుగు నెలల తర్వాత ఉత్థాన ఏకాదశి రోజున విష్ణుమూర్తి మేల్కొంటారని ప్రవచించారు. నాలుగు మాసాల కాలాన్ని పవిత్రంగా పరిగణించి చాతుర్మాస్య దీక్ష చేపట్టడం శుభపరిణామని వివరించారు.

మట్టపల్లి నృసింహుని క్షేత్రంలో..

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం తొలిఏకాదశి వేడుకలకు వైభవంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్కులు ముందుగా కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయాన్ని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి దర్శించుకున్నారు ఎమ్మెల్యేను ఆలయ పాలకవర్గం, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేకు స్వామివారి శేష వస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు కుల సత్రాల వారు అన్నదాన సౌకర్యం కల్పించారు. మట్టపల్లిలో లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరిమట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.



గుట్ట ఆలయంలో ప్రవచనాలు చేస్తున్న సరస్వతి స్వామిజీ



గుట్టలోఉభయ కూలైన్లల్లో భక్తుల రద్దీ

మేళ్లచెర్వు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో..

మేళ్లచెర్వు: తొలి ఏకాదశి పండుగను సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి శ్రీలక్ష్మీ నరసింహ భజన బృందం 24 గంటలు నిరంతరాయంగా ఏకనామ భజన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొండారెడ్డి, ఛైర్మన్ శంభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మేళ్లచెర్వు మండల కేంద్రంలో శ్రీభూనీల సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుదర్శనం ప్రసాద్, మోహన్ కృష్ణ, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● మేళ్లచెర్వు మండల కేంద్రంలోని ఉప్పలమ్మైసమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ ఐదో వార్షికోత్సవం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంభయ్య, వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ బండారుపల్లి రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సుల పరుగులు ఎన్నడో?

(5వ పేజీ తరువాయి)

అధికారులు కసరత్తు చేస్తున్నారు.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం

నల్లగొండ ఆర్టీసీ డిపోలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు లైన్ ఏర్పాటుకు సుమారు రూ.6కోట్లు కేటాయించారు. ఈ మినీ లైన్‌కు టెండర్ ఖరారు చేసి పనులు మొదలు ప్రారంభించగా, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. చార్జింగ్ పాయింట్‌గా నల్లగొండ డిపో ఉన్నందున ఈ మినీ విద్యుత్‌లైన్‌తో పాటు సబ్‌స్టేషన్ ఏర్పాటు త్వరితగతిన పూర్తయితే ఎలక్ట్రికల్ బస్సులు నడిచే అవకాశాలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ బస్సులు చార్జింగ్ కోసం స్విచ్ బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ చార్జింగ్ పాయింట్‌లకు విద్యుత్‌ను ఓవర్‌లోడ్ లేకుండా సమానంగా సరఫరా చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ బస్సులను ప్రోత్సహిస్తుండగా, హైదరాబాద్ నుంచి ఆపరేట్ చేస్తున్న ఇవి సూర్యాపేట డిపోలో విజయవంతంగా నడుస్తున్నాయి. నల్లగొండ డిపోలో మాత్రం జాప్యం జరుగుతోంది. దీనికి విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమే కారణమని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు నడిపిస్తాం

పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకువస్తున్న ఎలక్ట్రికల్ బస్సులను త్వరలోనే నల్లగొండ డిపో నుంచి నడిపించనున్నాం. అందుకు సంబంధించి చార్జింగ్ పాయింట్‌ల ఏర్పాటు పూర్తయినా, 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు లేఖలు రాశాం. ప్రస్తుతం నిర్వహణ పనులు నడుస్తున్నాయి. ఎలక్ట్రికల్ బస్సుల ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

కె.జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం

వారంలోపు సబ్‌స్టేషన్ పనులు పూర్తి

వారం రోజుల్లోపే విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తిచేసి చార్జింగ్ పాయింట్‌ల కోసం విద్యుత్ సరఫరా చేస్తాం. ఈ పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదు. రెండు టవర్‌లకు గాను ఒక టవర్ పనులు వారం రోజుల్లో పూర్తవుతాయి. అందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ఎలక్ట్రికల్ బస్సుల కోసమే ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం చేస్తున్నాం.

అన్నయ్య, విద్యుత్‌శాఖ డీఈ, నల్లగొండ

10 వేల మొక్కలు నాటడమే లక్ష్యం

● ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు



యాదగిరిగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన పరిధిలో 10వేల మొక్కలు నాటి వాటిని పెంచడమే లక్ష్యమని ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు అన్నారు. ఆదివారం వన మహోత్సవంలో భాగంగా యాదగిరిగుట్ట దేవస్థానం మల్లాపురం గోశాలలో దేవాదాయ వైదిక సలహాదారుడు గోవింద హరితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కలు పెరిగి పెద్దవైతే ప్రాణవాయువు అందించిన వారవుతారన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే.శేషగిరిరావు, గోశాల సిబ్బంది ఉన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కేతేపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇనుపాములలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం వరుస క్రమంలో సోమవారం సాయంత్రం వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కట్టంగూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రవాణారంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెంజర్ల సైదులు కోరారు. కట్టంగూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రవాణా కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. 2019 మోటార్ వెహికిల్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన అన్నారు.

సమాచారం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలి

శాలిగౌరారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సత్వరమే ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నెబోయిన సుధాకర్ అన్నారు. మండలంలోని ఉట్కూరు గ్రామంలో ఆదివారం వేముల రవళినగేష్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉట్కూరు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కుర్ర లింగయ్య, నాయకులు వేముల రామచంద్రు, పాకాల సతీష్, వేముల గోపినాథ్, వేముల సాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

నల్లగొండరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 9వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించనున్న సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో ఆర్జాలబావిలో నిర్వహించిన యూనియన్ సమావేశం ఆయన మాట్లాడారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గంజి నాగరాజు, పెండెం బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ..'హంగులబడి'!

- ప్లే స్కూళ్లను తలపించేలా ఏర్పాట్లు
- అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త ఫర్నిచర్
- బుక్‌రాక్‌లు, రెక్టాంగిల్, రౌండ్ టేబుల్స్ పంపిణీ
- పిల్లల్లో పెరుగుతున్న పఠనాసక్తి



ఓ అంగన్‌వాడీ కేంద్రంలోని రౌండ్ టేబుల్ చుట్టూ కూర్చున్న చిన్నారులు (ఫైల్)

నార్కట్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అంగన్ వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఈ మేరకు విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు ప్రారంభించింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలో కేంద్రాలకు పిల్లల సంఖ్య పెంచేందుకు అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పాత వారితో పాటు నూతన పిల్లలు కూడా చేరారు. దీంతో కేంద్రాల్లో పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో కేంద్రాల్లో పిల్లలకు ఇబ్బందులు కలుగకుండా సదుపాయాలు కల్పిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త హంగులు కనపడుతున్నాయి. కేంద్రాలకు సరఫరా అవుతున్న ఫర్నీచర్‌తో 'అంగన్‌వాడీ' క్రమంగా 'హంగులబడి'గా మారుతోంది. కార్పొరేట్ ప్లే స్కూల్స్ మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలు రూపుదిద్దుకుంటున్నాయి.

నూతన పుస్తకాలు, ఫర్నీచర్

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లల ఆటపాటల కోసం ఎన్నో రకాల ఆట వస్తువులు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. తాజాగా అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా ఫర్నీచర్ సమకూరుతోంది. బుక్ రాక్, రౌండ్ టేబుల్, రెక్టాంగిల్ టేబుళ్లను ప్రభుత్వం అందజేస్తుంది. ఓ ఏజెన్సీ ద్వారా వీటిని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. నకిరేకల్ ప్రాజెక్టు పరిధిలోని నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలలోని 250 అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేయనున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికే వీటిని అందజేశారు. వీటి చేరికతో అంగన్‌వాడీ కేంద్రాలు కార్పొరేట్ ప్లే స్కూల్స్‌ను తలదన్నేలా ఉంటున్నాయి. ఓ వైపు పౌష్టికాహారం అందజేస్తూనే మరోవైపు హంగులద్దుతూ అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆకట్టుకునేలా పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా ఆకర్షించేలా ఫర్నీచర్‌ను సమకూరుస్తున్నారు. ఇంతకాలం బుక్‌రాక్ లేక గదిలో సెల్ఫ్‌లాంటి రాక్ ప్రదేశంలో చిన్నారుల పలకలు, బొమ్మల కథల పుస్తకాలను భద్రపరిచేవారు. అయితే ప్రస్తుతం వీటిని భద్రపరిచేందుకు బుక్‌రాక్‌లను అందజేశారు. కథల పుస్తకాలను ఈ బుక్‌రాక్‌లో పెడుతున్నారు. ఇప్పటికే కేంద్రాల్లో ఉన్న చిన్న కుర్చీలు, రెక్టాంగిల్, రౌండ్ టేబుల్స్ చుట్టూ వేసి చిన్నారులను ఆ కుర్చీల్లో కూర్చోబెట్టి డ్రాయింగ్ వేయించడం, కథలు పాఠాలు చెప్పడం చేస్తున్నారు. దీంతో వీటిపై చిన్నారుల్లో ఆసక్తి పెరిగింది. ఇంటి నుంచి తెచ్చుకునే పలకలను బుక్‌రాక్‌లో కూడా పెట్టుకుంటున్నారు.



కేంద్రాలకు అందజేసిన రౌండ్, రెక్టాంగిల్ టేబుల్స్

ప్రీస్కూల్స్ బలోపేతానికి దోహదం



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఫర్నీచర్‌తో పిల్లలకు ఇంటి వాతావరణం కల్పిస్తుంది. గతంలో కేవలం పలక, బలపం వంటివి మాత్రమే ఉండేవి. కార్పొరేట్ ప్లే స్కూళ్లకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ప్రీస్కూల్స్ బలోపేతం కావడానికి దోహదపడుతున్నాయి. రౌండ్ టేబుల్ చుట్టూ చిన్న కుర్చీల్లో కూర్చుని టీచర్ కథల పాఠాలు చెబుతుంటే ఆసక్తిగా వినడం సృజనాత్మకతకు పదును పెట్టేందుకు అందరూ కలిసి నేర్చుకునే పరిస్థితులను కల్పిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు తొలివిడతగా ఫర్నీచర్ సరఫరా చేస్తున్నారు.

- అస్రాఅంజుమ్, సీడీపీవో, నకిరేకల్

పిల్లల్లో ఆసక్తి పెరిగింది



అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవల సరఫరా చేయబడిన రౌండ్ టేబుల్, రెక్టాంగిల్ టేబుల్స్‌తో పిల్లల్లో పఠనాసక్తి పెరిగింది. ఇంతకుముందు కింద కూర్చుని ఒళ్లో పలక, పుస్తకాలు పెట్టుకుని రాయడం, డ్రాయింగ్ వేయడం వంటివి చేసేవారు. దీంతో వారు కొంత అసౌకర్యానికి గురయ్యేవారు. కానీ ఇపుడు రౌండ్ టేబుల్, రెక్టాంగిల్ టేబుల్ వాడకం ద్వారా వాటి చుట్టూ కుర్చీల్లో కూర్చుని డ్రాయింగ్ వేయడం, అక్షరాలు దిద్దడం, కథల పాఠాలు వినడంలో కొంత శ్రద్ధ కనపడుతోంది.

- లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, నార్కట్‌పల్లి

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : తొలి ఏకాదశి వేడుకలను జిల్లా ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారు జామునుంచే ఆలయాలకు చేరుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలను చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిటకిట లాడాయి. కొన్ని ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

● నార్కట్‌పల్లి : మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్ప దంపతులు పాల్గొని స్వామివారికి పంచామృతాభిషేకాలను చేయించారు. తొలి ఏకాదశి పర్వదిన విశిష్టత, ఉపవాసదీక్ష యొక్క ఆవశ్యకతను ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ వివరించారు. ఆలయ ఈవో సిరికొండ నవీన్‌కుమార్ ఎమ్మెల్యే దంపతులకు శాలువాతో సత్కరించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, బండా సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, సట్టు సత్తయ్య పాల్గొన్నారు.

● వేణుగోపాల స్వామి ఆలయంలో: నార్కట్‌పల్లి పట్టణంలోని వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వారిజాల వేణుగోపాల స్వామి మూలమూర్తులకు పంచామృతాభిషేకాలను నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు కారంపూడి కృష్ణమాచార్యుల చే శాస్త్రోక్తంగా మూలవిరాట్టు అభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దోసపాటి ప్రసాద్, ఐతరాజు రమేశ్, పసునూరి శ్రీనివాస్, దయాకర్, పాండురంగయ్య, రవీందర్, బండారు రమేశ్, యాద వెంకన్న, జెరిపోతుల భరత్, కొండల్ రెడ్డి, దోసపాటి వేణు, పాల్గొన్నారు.

● చండూరు రూరల్ : మండలంలోని వివిధ దేవాలయాలు విద్యుత్ దీపాలు, తోరణాలు, భక్తులతో కళకళలాడాయి. తుమ్మలపల్లి, చామలపల్లి గ్రామాల్లో గుట్టలకు భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. చామలపల్లిలో జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున పాల్గొని, గుట్టపై ఉన్న అఖండ దీపం, శివలింగాన్ని, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. తుమ్మలపల్లి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో నాగిరెడ్డి ఆలయంలో శివుడికి అభిషేకం నిర్వహించారు.

● కట్టంగూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో స్వామి వారి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, ఏకాదశి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామడుగు శ్రీనివాసశర్మ, శివాలయ చైర్మన్ దోరేపల్లి శ్రీను, ఇలెందుల రాంమూర్తి ఉన్నారు.



నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీ సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నార్కట్‌పల్లి : చెర్వుగట్టు ఆలయ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు



నల్లగొండ వీటీ కాలనీలో శివలింగానికి అభిషేకం చేస్తున్న యువతి



నల్లగొండ పట్టణంలోని రామాలయంలో ...

చెట్లను పెంచి ప్రకృతిని కాపాడుకోవాలి

● ఈవో అంబటి నాగిరెడ్డి



రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఈవో నాగిరెడ్డి

చండూరురూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, తద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని దేవాదాయశాఖ అధికారి అంబటి నాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. ప్రకృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, భవిష్యత్తు తరాలకు, మన పిల్లలకు మనము స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. చెట్లను పెంచుదాం ప్రకృతిని కాపాడుదామని నినదించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ గున్‌రెడ్డి రమ్య రామలింగారెడ్డి, ధర్మకర్తలు బోయపల్లి రాములు, జిల్ల నర్సింహ, కురుపాటి వెంకటమ్మ, ముత్తయ్య, మాజీ చైర్మన్ గజ్జల కృష్ణారెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కురుపాటి శేఖర్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కురుపాటి సుధర్శన్, నాయకులు నాగరాజు, లింగయ్య, వెంకటేష్, ఆలయ అర్చకులు కారువంగ శంకర్‌శర్మ, హరి ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

చిట్యాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యురాలు కొండపల్లి వసుమతి, భారత్ వికాస్ పరిషత్ సంస్థ అధ్యక్షుడు రఘుసతీష్‌కుమార్ అన్నారు. చిట్యాలలో భారత్ వికాస్ పరిషత్, జనహిత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కుట్టు శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, ముఖ్యంగా ఆర్థికంగా శక్తివంతులు కావాలని కోరారు. మహిళలు తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని, ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పా వాసుదేవరెడ్డి, ముప్పా హేమలత, శ్రీలత, బొబ్బల శివశంకర్‌రెడ్డి, మంజుల, శ్రీదేవి, సత్యనారయణ, అనిత తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో జగ్జీవన్‌రాం వర్ధంతి



జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిట్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రాం వర్ధంతిని ఆదివారం చిట్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చిన మల్లయ్య, నాయకులు ఎద్దులపురి కృష్ణ, ఏర్పుల పరమేష్, దేశపాక రాజేష్, బొబ్బల రాంరెడ్డి, రెమిడాల మధు, గంగారపు గణేష్, నర్సింహ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కట్టంగూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యావేత్త భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు అన్నారు. ఆదివారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు, నాయకులు పబ్బు వెంకటేశ్వర్లు, పాదూరి వెంకట్‌రెడ్డి, హరిబాబు, నాగరాజు, బీజేవైఎం మండలాధ్యక్షుడు బత్తిని నాగరాజు, పులకరం నాగరాజు, ఆంజనేయులు, గణేష్ వినోద్, శివ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

మర్రిగూడ, మునుగోడు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ప్రజలు మొహరం వేడుకను కన్నులపండువగా నిర్వహించుకున్నారు. ఆదివారం మొహర్రం సందర్భంగా మతాలకతీతంగా హిందూ, ముస్లింలు అన్నదమ్ముల వలె కలిసిమెలసి ఉంటూ పీర్లను ఎత్తుకొని గ్రామంలో ఊరేగిస్తూ అలావ్ గుండం వద్ద చుట్టూ తిరుగుతూ ఎగురుతూ డప్పుచప్పుళ్లతో వేడుకలను నిర్వహించారు. మండలంలోని ఇందుర్తి మేటిచందాపురం గ్రామంలో ఆ గ్రామానికి చెందిన అయితగోని యాదగిరి మొహర్రం సందర్భంగా రూ.15వేలు ముస్లింలకు విరాళంగా అందజేశారు.

● మునుగోడు మండలంలోని కోతులారం గ్రామంలో మొహర్రాన్ని వైభవంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తన సతీమణి అనితతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం పండుగను ప్రతీ సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు.



కోతులారంలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న జాజుల శ్రీనివాస్ గౌడ్ దంపతులు



నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో పీర్ల సందడి

సమాజంలో గురువుకు ఉన్నత స్థానం

చిట్యాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో గురువుకు ఉన్నతస్థానం ఉందని ప్రముఖ న్యాయవాది పంతంగి శోభన్‌బాబు అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం చిట్యాలలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జైశ్రీరామ్ ప్రభాత్‌శాఖ నిర్వహించిన వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురోపదేశంతోనే వ్యక్తి పరిపూర్ణుడవుతాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ్ మామిడి శ్రవణ్‌కుమార్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు యాదగిరిరెడ్డి జయంతి

శాలిగౌరారం, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చామల యాదగిరిరెడ్డి జయంతిని ఆ పార్టీ ఆధ్వర్యంలో శాలిగౌరారంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు వెంకటరమణారెడ్డి, ధనుంజయ, రమేష్, పరమేష్, జీడికల్లు, నగేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

శాలిగౌరారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగమర్తి గ్రామానికి చెందిన చింత దావీదు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి చైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ రూ.5వేలను బెల్లి వీరభద్రం చేతుల మీదుగా కుటుంబానికి అందించారు. అలాగే బెల్లి వీరభద్రం 50 కిలోల బియ్యం, బూత్కూరి నర్సిరెడ్డి 25 కిలోల బియ్యం, బాసాని వెంకన్న రూ.1,500 అందజేశారు


సమాజ సేవలకు గుర్తుగా సన్మానం

నార్కట్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేస్తం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, జాగృతి నియోజకవర్గ కన్వీనర్ టీజీ లింగం గౌడ్‌ను ఎన్‌సీసీ సీనియర్ బాలికల క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్ సరోజ్ బాల ఠాకూర్ ఆదివారం ఘనంగా సన్మానించారు. నేస్తం స్వచ్ఛంద సంస్థ ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మీ, శ్రీనివాస్, రాజశేఖర్, నాగచారి తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 35.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 7 జూలై 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	527.00 (162.3490)	57,668	4,724
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.65 (3.60)	209.02	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.215 (20.3903)	నిల్	5,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



నార్కట్‌పల్లి డిపోలో నిలిచిన ఎలక్ట్రికల్ బస్సులు

ఎలక్ట్రికల్ బస్సుల పరుగులు ఎన్నడో?

- ఇప్పటికే సూర్యాపేట డిపో పరిధిలో రోడ్డెక్కిన బస్సులు
- జిల్లా బస్సులు మాత్రం నార్కట్‌పల్లి డిపోలో భద్రం
- సబ్‌స్టేషన్ నిర్మాణంలో జాప్యం చేస్తున్న విద్యుత్‌శాఖ
- చార్జింగ్ పాయింట్‌లకు విద్యుత్ లేక బస్సులు నడపని పరిస్థితి



పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మంజూరుచేసిన ఎలక్ట్రికల్ బస్సులు ఇప్పటికే సూర్యాపేట డిపో పరిధిలో పరుగులు పెడుతూ ప్రయాణికుల కు సేవలు అందిస్తుండగా, జిల్లాలో మాత్రం రోడ్డెక్కడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు ఆరు నెలలుగా 33/11కేవీ లైన్‌ను ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తుండటంతో చార్జింగ్ పాయింట్లకు విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఎలక్ట్రికల్ బస్సులు డిపోకే పరిమితమవుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

సూర్యాపేట జిల్లాకు 79 ఎలక్ట్రికల్ బస్సులను మంజూరు చేయగా, ఇప్పటికే 45 బస్సులు డిపోకు చేరాయి. అవి ప్రయాణికులకు సేవలు కూడా అందిస్తున్నాయి. నల్లగొండ డిపోకు 75 బస్సులు మంజూరు చేయగా, ఇప్పటికే 40 బస్సులు చేరాయి. అయితే అవి నార్కట్‌పల్లి డిపో ఆవరణలో భద్రపరిచారు. ఆరు నెలల క్రితమే విద్యుత్ పనులు పూర్తి కావాల్సి ఉండగా, సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో బస్సులు నడవడం లేదు. ఇటీవల నల్లగొండ రీజియన్ ఆర్టీసీ అధికారులు విద్యుత్‌శాఖ అధికారులకు లేఖ కూడా రాశారు. అయితే ఆ పనులు ఎప్పటికి పూర్తవుతాయో స్పష్టమైన సమాచారం లేదు. ఇప్పటికే ఎలక్ట్రికల్ బస్సులు రోడ్లపై తిరగాల్సి ఉండగా, సబ్‌స్టేషన్ లేకపోవడం, చార్జింగ్ పాయింట్‌కు విద్యుత్ రాకపోవడంతో ఎలక్ట్రికల్ బస్సులు నార్కట్‌పల్లి డిపోలోనే నిలిపారు. బస్సులు రన్నింగ్‌లో లేకపోవడం, ఇలాగే జాప్యం చేస్తే చార్జింగ్ లేక అవి మరమ్మతులకు గురయ్యే అవకాశం ఉంది. యాదాద్రి జిల్లాకు సంబంధించి విద్యుత్ బస్సుల కోసం ప్రతిపాదనలు పంపగా, ఆ జిల్లాకు ఎన్ని బస్సులు కేటాయించాలనే దానిపై ఆర్టీసీ

- మిగతా 7వ పేజీలో...

వానాకాలం సీజన్‌లో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్‌కు నీటి విడుదల ప్రారంభమైంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతోంది. దీంతో నేరేడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీకి చెందిన మత్స్యకారులు చేపల వేటకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు వలలు, బోట్లు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

- (ఆంధ్రజ్యోతి,దేవరకొండ/నేరేడుగొమ్ము)



వైజాగ్‌కాలనీ చేపల వేటకు వేళాయే

- శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదల
- కృష్ణాపరివాహక ప్రాంతంలో పెరుగుతున్న నీటిమట్టం
- మత్స్యకారుల ఆనందం

కృష్ణాపరివాహక ప్రాంతంలో కొంత కాలంగా నీటిమట్టం తగ్గడంతో వైజాగ్‌కాలనీకి చెందిన మత్స్యకారులు చేపలవేట లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేగాక బోట్లు, వలలు మూలనపడ్డాయి. ఈ ఏడాది ముందస్తుగానే కృష్ణానది ఎగువభాగంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరువలో ఉంది. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల చేస్తుండడంతో కృష్ణాపరివాహక ప్రాంతంలో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతోంది. దీంతో మత్స్యకారులు ఉత్సాహంగా ఉన్నారు. ముందస్తుగా కృష్ణా పరివాహక ప్రాంతంలో నీరు పెరుగుతుండడంతో చేపల వేట పెరుగుతుందని ఆశాభావంతో మత్స్యకారులు అందుకు సన్నద్ధమవుతున్నారు.

చేపల వేటే ప్రధాన వృత్తి

వైజాగ్‌కాలనీలో 400 కుటుంబాలు ఉన్నాయి. వారందరికీ చేపల వేటే జీవనాధారం. 100వరకు మరపడవలు, బోట్లు ఉన్నాయి. మత్స్యకారులు 20 నుంచి 30 కిలో మీటర్ల దూరం వరకు బోట్లు, పుట్టీలు, పడవల్లో వెళ్లి చేపల వేట కొనసాగిస్తారు. పుట్టీలో వెళ్లే క్రమంలో ఈదురుగాలులు వీచినా, అలల తాకిడి పెరిగినా, వర్షం కురిసినా ప్రమాదమే. అయినా వీరికి చేపలవేటే జీవనాధారం కావడంతో ప్రమాదకర వృత్తి అయినా తప్పడం లేదు. 50 ఏళ్లుగా వీరు వైజాగ్‌కాలనీలో ఇళ్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారు. సాగర్ వెనుక జలాల్లో పూర్తిస్థాయి నీటిమట్టం పెరిగితే చేపలవేట ఆశించిన మేర సాగదని మత్స్యకారులు చెబుతున్నారు. సీజన్‌లో ప్రతీ రోజు ఒక్కొక్కరు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు చేపలవేటతో ఉపాధి పొందుతున్నారు. వైజాగ్‌కాలనీ మత్స్యకారులు పట్టిన చేపలను హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. మత్స్యకారులు పట్టిన చేపలను వ్యాపారులు కొనుగోలు చేసి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

పచ్చి, వట్టి చేపలకు డిమాండ్

కృష్ణానదిలో పట్టిన చేపల్లో పోషక విలువలు అధికంగా ఉండడంతో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి చేపల్లో కొవ్వులేకపోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో అత్యధికంగా వీటిని తినేందుకు మొగ్గు చూపుతున్నారు. వైజాగ్‌కాలనీ మత్స్యకారులు పట్టి ఎండబెట్టిన చేపలను విశాఖపట్నం, బెంగుళూరు, చెన్నై, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. బొచ్చ, రవ్వ, పాంప్లేట్, ముల్లజల్లతోపాటు ఎండుచేపలను విక్రయిస్తారు. అదేవిధంగా కృష్ణమ్మ అందాలు చూసేందుకు వైజాగ్‌కాలనీకి పర్యాటకులు అధికంగా వస్తుంటారు. వారి కృష్ణానదిలో ఉత్సాహంగా స్నానాలు చేసి, బోట్ షికారు చేయడంతోపాటు ఇక్కడి మహిళతో చేపల వంటలు చేయించుకొని ఆరగిస్తుంటారు. దీంతో వీరికి ఉపాధి కలుగుతోంది. అయితే ఇక్కడి తమకు ప్రభుత్వం రుణాలు మంజూరుచేయడంతోపాటు, వలలు, బోట్లు అందజేయాలని, ఎకోటూరిజంగా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

రుణాలు మంజూరు చేసి వలలు పంపిణీ చేయాలి



నేను 30 ఏళ్లుగా వైజాగ్‌కాలనీలో ఉంటూ చేపలవేట ఆధారంగా జీవనం సాగిస్తున్నా.ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది.చేపలవేటకు వెళ్తే రూ.1000నుంచి రూ.1500 వరకు గిట్టుబాటు అవుతుంది. వలలు, మరబోట్లకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలి.

- వాసిపల్లి అచ్చయ్య, మత్స్యకారుడు, వైజాగ్‌కాలనీ

ఎకోటూరిజం కేంద్రంగా అభివృద్ధి



వైజాగ్‌కాలనీలో ఎకోటూరిజం ఏర్పాటు చేస్తాం. దీంతో పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. త్వరలో ఎకోటూరిజం పనులు ప్రారంభమవుతాయి. వైజాగ్‌కాలనీతోపాటు గాజుబేడం గుహలు, దేవరచర్ల శివాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధిచేస్తాం.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

కేజీబీవీల్లో.. కొత్త మెనూ



కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కొత్త మెనూ ప్రకారం ఆహార పదార్థాలు

రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా నూతన మెనూ అమలు చేయాలని ఆదేశించింది. నెలలో రెండుసార్లు మాంసాహారంతోపాటు వారంలో ఐదుసార్లు గుడ్లు, రోజూ నెయ్యి అందిస్తున్నారు. నూతన మెనూ పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ ఆదేశించింది. 2025-26 విద్యా సంవత్సరంలో సరికొత్త రుచులతో వంటకాలు చేయాలని ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచింది. గతంలో ఒక్కో విద్యార్థికి నెలకు మెస్ చార్జీలు రూ.1225 ఉండగా ఇప్పుడు రూ. 1740కి పెంచింది.

- (ఆంధ్రజ్యోతి,భూదాన్‌పోచంపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో రూపొందించిన కొత్త మెనూను అమలు చేయడం ఆరంభించింది. దీని అమలుకు కార్యాచరణ కూడా సిద్ధం చేసింది. అయితే దీన్ని అమలు చేయడానికి అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు తరుచూ పర్యవేక్షిస్తేనే ఈ మెనూ సక్రమంగా అమలయ్యే అవకాశం ఉంది.

కొత్త మెనూ ప్రకారం..

- **ఉదయం అల్పాహారం:** టమాటా, కిచిడీ , రాగిజావ,ఇడ్లీ సాంబారు, పాలు, పూరీ, పులిహోర,బోండా, ఉప్మా, చపాతీ, అరటిపండ్లు.
- **మధ్యాహ్నం:** అన్నంతోపాటు టమాటా పప్పు, నెయ్యిరసం,పెరుగు,బాయిల్డ్ ఎగ్, చికెన్, మటన్.
- **సాయంత్రం:** ఉడికించిన పెసర్లు, శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లం-పల్లీలు, అల్లం టీ, మిల్లెట్ బిస్కట్‌లు, పకోడి. **రాత్రి :** అన్నంతోపాటు వివిధరకాల కూరలు,సాంబార్, బటర్ మిల్క్.

కొత్త మెనూ పక్కాగా అమలు చేస్తాం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొత్త మెనూ పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. కేజీబీవీల్లో విద్యార్థినులకు ఏరోజు ఎంత ఇవ్వాలనేది మెనూ నోటీస్ బోర్డు ద్వారా వివరిస్తాం. చదువుతోపాటు బాధ్యతగా పౌష్టికాహారం అందేలా చూస్తాం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతాం.

- ప్రభాకర్, ఎంఈవో, భూదాన్‌పోచంపల్లి

దేశ నిర్మాణానికి బాటలు వేసిన జగ్జీవన్‌రాం

జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శశికళ



సాంఘిక సంక్షేమశాఖ డీడీ శశికళ

నల్లగొండ టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భావి భారత నిర్మాణానికి బాటలు వేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం అని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.శశికళ అన్నారు. మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా పదవు లు నిర్వహించి దేశ సర్వతోముఖాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, సమానత్వం కోసం జగ్జీవన్ ఉద్యమించారన్నారు. మహనీయుల ఆశయసాధన సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ పెరిక కరన్‌జయరాజ్, జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, ఐబీసీ ఛానల్ ఎండీ ఏచూరి భాస్కర్, శైలజ, కత్తుల షణ్ముఖకుమార్, పెరిక ఉమామహేశ్వర్‌రాజు, దుబ్బ రూప అశోక్‌సుందర్, కందుల లక్ష్మయ్య, విరిగి ప్రసాద్, కత్తుల తులసీదాస్, పడిదల నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మీ-సేవలో

- 22 శాఖలకు సంబంధించిన 482 రకాల సేవలు
- అందుబాటులో మరో రెండు రకాల సేవలు
- మార్కెట్ విలువ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం

6

పచ్చిరొట్టతో పుడమికి పోషణ

జీలుగు, పెసర సాగుచేస్తున్న రైతులు

7

గంజాయికి బానిసలై.. ఇళ్లలో దొంగతనాలు

- గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ముఠా
- రూ.20లక్షల సొత్తు స్వాధీనం

6

ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం



వైశ్య రాజకీయ రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణ

నార్కట్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆగస్టు 3న హైదరాబాద్‌లో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం నార్కట్‌పల్లిలోని వాసవీ భవన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ చైతన్యం కోల్పోతుండటంతో వైశ్యజాతి వివక్షకు గురవుతోందని, ఓటు బ్యాంకు వర్గంగా ముద్రపడుతోందని అన్నారు. వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని గతంలో తాను నిర్వహించిన వైశ్య గర్జన ఫలితంగా ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అగ్రవర్ణం అనే ముద్ర కారణంగా పేద వైశ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన నివేదికలోని అగ్రవర్ణాల వివరాలను ప్రకటించి ఈడబ్ల్యూఎస్‌ను వర్గీకరించాలని, విదేశీ సహాయ నిధి ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలన్నారు. వీటన్నింటినీ సాధించుకోవాలంటే పాలకులపై ఒత్తిడి తేవాలని, ఆ సన్నాహకంలో భాగంగానే నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారుడిగా నియమితుడైన కాచం సత్యనారాయణను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిశెట్టి శ్రీనివాస్, బుక్కా ఈశ్వరయ్య, సల్లా వాసుదేవ్, మండల గౌరవాధ్యక్షుడు ఇడుకుళ్ల బిక్షమయ్య, మండల, పట్టణ శాఖల అధ్యక్షులు బిల్లకంటి శ్రీకాంత్, పసునూరి శ్రీనివాస్, కర్నాటి రమాదేవి, దేవరశెట్టి నారాయణ, షరాబు శ్రీనివాస్, భాశెట్టి శ్రీనివాస్, ఇడుకుళ్ల సంపత్, పసునూరి సంపత్, దోసపాటి వేణు, బండారు శ్రీనివాస్, రమేశ్, పబ్బతి ప్రసాద్, పల్లెర్ల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో పూజల్లో పాల్గొన్న భక్తులు

శాస్త్రోక్తంగా తొలి ఏకాదశి

నల్లగొండ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే సమీపంలోని దేవాలయాలకు చేరుకొని ఇష్టదైవాన్ని పూజించారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. పట్టణంలోని రామగిరి సీతారామచంద్ర స్వామి దేవాలయం, వీటీ కాలనీలలోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి దేవాలయం, తులసీనగర్ భక్తాంజనేయ స్వామి దేవాలయం, షేర్ బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, పానగల్లులోని ఛాయ, పచ్చల సోమేశ్వరాలయంలో తొలి ఏకాదశి వేడుకలను అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రామాలయంలో వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం చేశారు. రాఘవేంద్ర కాలనీలో షిర్డీ సాయి సహిత ద్వాదశ జోతిర్లింగాల ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేసి గోరింటాకు పండుగను నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో చంద్రమౌళీశ్వర స్వామికి అర్చకుడు మహంకాళి పవన్ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం నుంచి హిందువుల పండుగలు మొదలుకానున్నాయి.



నల్లగొండ రామాలయంలో పవళింపు సేవ

వేడుకగా మొహర్రం



నల్లగొండలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

నల్లగొండ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త మనువడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి ప్రతీకగా నిలిచిన మొహర్రం పండుగను ముస్లింలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల నుంచి పీర్ల కొట్టంలో బడే నాల్‌సాబ్, చోటేనాల్‌సాబ్ పీర్లను అధిష్ఠింపజేసి ఆదివారం ప్రార్థనలు నిర్వహించి పట్టణంలో ఊరేగించారు. జామ మసీదులోని పీర్ల కొట్టం నుంచి మొదలైన ఊరేగింపు పట్టణ పురవీధుల గుండా సాగింది. భక్తులు అడుగడుగునా పీర్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. పానగల్లులోని చెరువు వద్దకు ఊరేగింపు నిర్వహించి పీర్లను నిమజ్జనం చేశారు. ఊరేగింపు సందర్భంగా ముస్లిం యువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మిర్యాలగూడ అదనపు పీపీగా రఘురామరావు నియామకం

7

ఎల్లమ్మ ఆలయంలో జిల్లా జడ్జి కవిత

కనగల్, జూలై 6:(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశీపురం రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని జిల్లా ఉమెన్స్ కోర్టు జడ్జి కవిత ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. పూజల అనంతరం అర్చకులు జడ్జికి వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న జిల్లా జడ్జి కవిత

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● సోమవారం 7 జూలై 2025

వాహనదారులు నిబంధనలు పాటించాలి: ఎస్ఐ

కొండమల్లేపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్ఐ అజ్మీర రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది రాము, విజయేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దత్తాశ్రమ పీఠాధిపతి వర్ధంతి

మిర్యాలగూడటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సాయిదత్తాశ్రమ పీఠాధిపతి కాకాని ఈశ్వరమ్మ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేకాలనీ దత్తాశ్రమంలో ఈశ్వరమ్మ విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. ఆశ్రమ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంత భక్తులకు ఈశ్వరమ్మ మాతాజీ అందించిన ఆధ్యాత్మిక సేవలు గొప్పవన్నారు. కార్యక్రమంలో జానకిరాముడు, జగన్నాధరావు, ప్రతాప్, సోమన్న, విక్రమ్, మట్టయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

మూత‘బడి’

- డిండి మండలంలో 21 పాఠశాలల మూసివేత
- అదే బాటలో మరికొన్ని పాఠశాలలు
- ప్రభుత్వ పాఠశాలలపై సన్నగిల్లుతున్న నమ్మకం



విద్యార్థులు లేక మూతపడిన బొగ్గులదొన ప్రాథమిక పాఠశాల

డిండి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లడంతో వాటి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధనపై ఆసక్తితో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏడాది గణనీయంగా తగ్గి పాఠశాలలు వెలవెలబోతున్నాయి. జూన్ మొదటి వారం నుంచి కరపత్రాలు పంచుతూ ఇంటింటికీ తిరిగి ఉపాధ్యాయులు ప్రచారం చేసినా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబరచడంలేదు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించే స్థోమత లేనివారు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావడంలేదు. మండలంలో 46 ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఇప్పటికే 21 పాఠశాలలు మూతపడ్డాయి. మరికొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడే దశలో ఉన్నాయి. బొగ్గులదొన ప్రాథమిక పాఠశాల 2024-25 విద్యాసంవత్సరంలో మూతపడింది. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలను తెరిచినా ఆరుగురు విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఒకటి, రెండు రోజులు హాజరైన విద్యార్థులు పాఠశాలకు రాకపోవడంతో ఈ విద్యాసంవత్సరం కూడా మూసివేశారు. కొత్తతండా ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణం గా విద్యార్థులు లేకపోవడంతో ఇద్దరు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. ప్రాథమిక పాఠశాల ల్లో అదనంగా ఉన్న సెకండ్ గ్రేడ్ టీచర్లను డిప్యుటేషన్‌పై ఉన్నత పాఠశాలలకు పంపించడాన్ని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం

మండలంలో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈ నెల 15వ తేదీ తర్వాత ఉపాధ్యాయులను విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే విధంగా కృషి చేస్తున్నాం.
- గోప్యానాయక్, ఎంఈవో

విద్యార్థుల సంఖ్య తగ్గిన కొన్ని పాఠశాలలు

మండలంలోని ఆకుతోటపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు, రుద్రాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో 4, కిందిశేషాయికుంట పాఠశాలలో 7గురు, కొత్త తండాలో 12 మంది, టి.గౌరారం కాలనీ ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం హాజరవుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఎంఈవోకు నివేదికను అందజేశారు. మండలంలో 8 ఉన్నత పాఠశాలలు ఉండగా కామేపల్లి ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల్లో 38 మంది, టి.గౌరారం హైస్కూల్‌లో 42 మంది, గోనబోయినపల్లి ఉన్నత పాఠశాలలో 43 మంది, రామంతపూర్ హైస్కూల్‌లో 72 మంది, కందుకూరులో 76 మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. హైస్కూల్‌లో ఒక తరగతిలో ఉం డాల్సిన విద్యార్థుల సంఖ్య పాఠశాలలోని ఐదు తరగతు లు కలిపి ఉండటం గమనార్హం. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా ఉన్నత పాఠశాలల్లో కూ డా ఇదే తరహాలో క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.

ట్యాంక్ నిర్మించారు..

కనెక్షన్ మరిచారు!

- నిర్వహణపై వాటర్ గ్రిడ్, జీపీ అధికారుల్లో సందిగ్ధత
- కనెక్షన్ ఇవ్వని అధికారులు



రైతు వేదిక వద్ద వృథాగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద నీటి సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం 90వేల లీటర్ల సామర్థ్యంతో మిషన్ భగీరథ ట్యాంక్ నిర్మించింది. కానీ దానికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో కాలనీవాసులు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని సుమారు 200 ఇళ్లల్లో నీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ట్యాంకును నిర్మించారు. మిషన్ భగీరథ అధికారులు నేరుగా మెయిన్‌పైపు నుంచి ట్యాంక్‌కు కనెక్షన్ ఇస్తే ఇతర గ్రామాలకు నీటి సమస్య ఎదురవుతుందని పేర్కొంటున్నారు. ట్యాంక్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న 2లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఉన్న సంపులోకి కనెక్షన్ ఇస్తామని, అక్కడి నుంచి మోటార్ ద్వారా ట్యాంకుకు నీళ్లు సరఫరా చేయాలని ప్రతిపాదన చేశారు. కానీ కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు మాత్రం నేరుగా ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. ఒకవేళ సంపు నుంచి మోటార్ ద్వారా పంపిణీ చేసినా విద్యుత్ చార్జీలు, నిర్వహణ ఎవరు చేస్తారని మరో వాదన వినిపిస్తున్నారు. వాటర్ గ్రిడ్ ద్వారా అయితే వారే విద్యుత్ చార్జీలు చెల్లిస్తారు. ఒకవేళ ఇంటర్నల్ మిషన్ భగీరథ వారు అయితే గ్రామ పంచాయతీ ద్వారా నిర్వహణ చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే అసలే గ్రామ పంచాయతీలలో నిధులు లేవని కొత్తగా ఇది ఎక్కడ నిర్వహణ చర్యలు చేపట్టాలని జీపీ అధికారులు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్, మిషన్ భగీరథ అధికారుల సమన్వయలోపంతో ఎత్తులో ట్యాంకు నిర్మించారని పలువురు విమర్శిస్తున్నారు. ట్యాంకు ఏర్పాటు చేసి రెండేళ్లుగా వృథాగా ఉంచారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో కాలనీవాసులు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ఓట్ల కోసమే ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ట్యాంకు నిర్మించి కనెక్షన్ ఇవ్వకుండా కాలయాపన చేసిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించేందుకు కృషి

సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ట్యాంకుకు మెయిన్ పైపు నుంచి నేరుగా కనెక్షన్ ఇస్తే ఇతర గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు అందవు. దీంతో నీటి సమస్యలు ఏర్పడుతాయి. ట్యాంక్‌కు 100 మీటర్ల దూరంలో ఉన్న సంపునకు కనెక్షన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. మోటార్, పైపులకు అయ్యే ఖర్చులకు ఎస్టిమేషన్ సిద్ధంగా ఉంది. గ్రామ పంచాయతీ అధికారుల నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం.
- అత్తార్, డీఈ, మిషన్ భగీరథ గ్రిడ్

పేదలకు ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూలై 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాయకునితండాలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు ఆదివారం ఆ యన వెళ్లి వారితో మాట్లాడారు. గృహ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నాయకునితండాలో పేదలకు పూర్తిస్థాయిలో ఇళ్లు నిర్మించేందుకే తాము పైలట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయ, వేంకటేశ్వరస్వామి దేవాలయాల గోపురం, తోరణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, సీనియర్ నాయకులు లాలునాయక్, మునినాయక్, మాజీ సర్పంచ్ కొండలు, మాజీ ఎంపీటీసీ అచ్చునాయక్, నాయకులు శౌరీనాయక్, బిక్కునాయక్, నాగేందర్‌నాయక్, బిచ్యాలు, దేవుజా, స్వామి, మోతి, మోత్యా, మధు, దస్రు, ముని, రంగసాయి, బాలచందర్, పాండురంగ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

• ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ఐఎంఏ భవనంలో ఆదివారం జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ స్థాయి జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి పరిష్కరింపజేయడంలో విలేకరుల పాత్ర గొప్పదన్నారు. నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని, నిర్మాణం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. డీఎస్పీ రాజశేఖరరాజు మాట్లాడుతూ శాంతి భద్రతలు కల్పించేందుకు జర్నలిస్టుల సహకారం అవసరమన్నారు. సమావేశంలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎండీ.ఖాజాహమీదుద్దీన్ మాట్లాడుతూ జర్నలిజం ఫోర్త్ పిల్లర్ అని, ఆ రంగంలో పని చేసే వారిని గుర్తించాలని అన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అయూబ్, రాష్ట్రకమిటీ సభ్యుడు గూడపురి వెంకన్న, జాతీయ కమిటీ సభ్యుడు గుండా మహేష్, సీనియర్ జర్నలిస్టులు వాడపల్లి రమేష్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మంద సైదులు, గద్దల జయరాజు, నాయకులు ఇలియాస్, నాగాచారి, రాంప్రసాద్, మహేష్, శ్రీను, చంద్రశేఖర్, రాజారాం, నాగయ్య, కొండలు, సతీష్, రవి, రాము, నాగేందర్, వినయ్ పాల్గొన్నారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి



చింతపల్లిలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్యవైశ్యులందరూ సమష్టిగా ఉండి ఆర్థిక, రాజకీయ రంగంలో రాణించాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, నాయకులు ముచ్చర్ల యాదగిరి, దొంతం సంజీవరెడ్డి, ఎరుకుల వెంకటయ్యగౌడ్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వూరె లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు వందనపు ఆంజనేయులు, నాయకులు వాస శ్రీనివాస్, సముద్రాల నగేష్, వూరె సురేష్, రవి, బీఆర్ఎస్ నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, చెనమోని రాములు, కృష్ణయ్య, జగన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



గజలాపురంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మల్లయ్య

మాడ్గులపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. మండలంలోని గజలాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆదివారం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేద వాళ్లకు ఒక్క ఇళ్లు, ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. మండలంలోని కన్నెకల్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఇరుగంటి రాణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి రూ.10వేల ఆర్థికసహాయం అందించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ చింతరెడ్డి సైదిరెడ్డి, కామేపల్లి వెంకన్న, ఏఈ జ్యోతి, గ్రామ కార్యదర్శి శ్రవణ్‌రెడ్డి, లబ్ధిదారులు ఆలెంపల్లి సంధ్య, బారి మంగమ్మ, లక్ష్మమ్మ, నాయకులు పోలగని సైదులు, ఉగ్గిడి సత్యనారాయణ, కొండ భాస్కర్, కొండేటి శంకర్, నాగాచారి, సింగం కార్తీక్, వెంకటయ్య, మట్టయ్య, పగిళ్ల వెంకటేశ్వర్లు, కొండ భాస్కర్, శ్రీరాములు, సతీష్, చెన్నయ్య, కర్ణాకర్, చలమంద, నరేష్, సతీష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలతో ఆధ్యాత్మికత : కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), జూలై 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దేవాలయాలను నిర్మాణంతో ఆధ్యాత్మికత, భక్తిభావం పెంపొందుతాయని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని నాయకునితండాలో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయ, వెంకటేశ్వరస్వామి దేవాలయాలకు సంబంధించిన తోరణం కట్టడాన్ని ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సాగర్ సర్కిల్ సీఐ శ్రీనునాయక్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బీవీ.రమణరాజు, నాయకులు అల్లి పెద్దిరాజుయాదవ్, మెరావత్ కొండానాయక్, మునినాయక్, సక్కునాయక్, మెరావత్ నాగేందర్‌నాయక్, హాతీరాంనాయక్, బిచ్చాలు, మునినాయక్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు కృషి



మిర్యాలగూడలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సైదులుగౌడ్

మిర్యాలగూడటౌన్, దేవరకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు యువత కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించి, అంటరానితనం అమానుషమంటూ నినదించిన జగ్జీవన్ బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం పాటుపడ్డారని కొనియాడారు. దేశ చరిత్రలో, ప్రజల మనసుల్లో ఆయన చిరస్థాయిగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివప్రసాద్, నాయకులు గుణగంటి వెంకన్న, మొండికత్తి లింగయ్య, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

● దేవరకొండలో అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోసం సహదేవుడు ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు జగ్జీవన్‌రాంకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు కొత్తపల్లి రమేష్, జానీ, నాగరాజు, కొమ్మపల్లి ప్రేమ్‌కుమార్, నాగిళ్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు



కొండమల్లేపల్లిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

దేవరకొండ, చింతపల్లి, కొండమల్లేపల్లి, హాలియా, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు.

● దేవరకొండ పట్టణంలోని నందీశ్వర, పాత శివాలయం, ఖిల్లాలోని మార్కండేయ దేవాయంతో పాటు ముదిగొండలోని వీరభద్రస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

● చింతపల్లి మండలంలోని గొడకొండ్ల, వీటీనగర్, ఎం.మల్లేపల్లి, చింతపల్లి, తదితర గ్రామాల్లో ప్రజలు వైభవంగా ని ర్వహించారు. గొడకొండ్ల వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. కార్యక్రమాల్లో అర్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, చైర్మన్ అల్వాల జంగయ్య, మాజీ ఎంపీపీ భవానీపవన్‌కుమార్, మాజీ సర్పంచ్ గోవర్ధన్, నాయకులు భాస్కర్, రాంమోహన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

● కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని సీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

● హాలియా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, శివాలయం, సీతారామాంజనేయస్వామి, సాయిమందిరంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు.

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి : సీపీఐ



సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మిర్యాలగూడ, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేసి 44కార్మిక చట్టాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సయ్యద్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూలై 9వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను మానుకొని కార్మిక ప్రయోజనాలు కాపాడాలని కోరుతూ 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో లైట్ మోటార్ వెహికిల్స్ యూనియన్ కార్యదర్శి ఎండీ. అస్గర్, నాయకులు శ్రీనివాసరాజు, వెంకన్న, శివ, చక్రి, రఫీ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● దామరచర్ల: దామరచర్ల మండలకేంద్రంలో ఆదివారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వినోద్‌నాయక్, సీపీఐ మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి దయానంద్ పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగానాయక్, అక్కెనపల్లి సైదులు, ఎం.సైదులు, ఎస్‌కె.సుబానీ పాల్గొన్నారు.

● దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ నియోజకర్గ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, నాయకులు పోలూరి వెంకటరాములు, నీల వెంకటయ్య, మల్లయ్య, మైనుద్దీన్, లింగమయ్య, దేవయ్య పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

మాడ్గులపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోకి కల్వలపాలెం గ్రామంలో వర్షాలు కురవాలని ప్రజలు ఆదివారం వరదపాశం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండే విధంగా వర్షాలు కురవాలని దేవుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామస్థులు కొమ్ము సైదమ్మ, వెంకటమ్మ, గడ్డమీది మంగమ్మ, నర్మద, సైదమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.



వరదపాశంతో వెళ్తున్న గ్రామస్థులు

పేదలకు వైద్యసేవలు అందించడం అభినందనీయం

హాలియా, జూలై 6(ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్యసేవలు అందించడానికి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. హాలియాలో లయన్స్ క్లబ్, ఆదిత్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మంది కి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆదిత్య ఆస్పత్రి ఎండీ రవీందర్‌రెడ్డి, డాక్టర్ కర్ల రవీందర్‌రెడ్డి, హాలియా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీరమళ్ల శ్రీనివాస్, కార్యదర్శి సక్రునాయక్, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, రాము, రామాంజిరెడ్డి, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయసాధన కోసం కృషి చేయాలి

దేవరకొండ, చింతపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు బెజవాడ శేఖర్, పట్టణ అధ్యక్షుడు బొస్కుల సుధాకర్ అన్నారు. ఆదివారం దేవరకొండ, చింతపల్లి మండల కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : మార్గన్ / వెంకటేశ్వర: కన్నప్ప / రాఘవ: కుబేర / విట్రోస్: కుబేర, మార్గన్, దేవరకొండ: మనోజ్: కుబేర మైత్రి వెంకటేశ్వర: కన్నప్ప